క్లుప్తంగా

అంగర స్టేషన్‌లో సీఐ తనిఖీలు

కపిలేశ్వరపురం: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ సిబ్బంది బాధ్యతతో పని చేయాలని మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆదేశించారు. మండలంలోని అంగర పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఎస్సై డి.రవికుమార్ సిబ్బంది పనితీరును వివరించారు. స్టేషన్ పరిధిలో నేరాల శాతం తగ్గే దిశగా చర్యలు చేపట్టాలని, అక్రమ మద్యం తరలింపు, అసాంఘిక చర్యలను అరికట్టే దిశగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

రాయవరం ఎంపీడీవోగా కీర్తి స్పందన


కీర్తి స్పందన

రాయవరం: స్థానిక ఎంపీడీవోగా ఎస్.కీర్తి స్పందన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ రామచంద్రపురం ఎంపీడీవోగా పని చేసిన కీర్తి స్పందన బదిలీపై ఇక్కడకు వచ్చారు. రాయవరం ఎంపీడీవోగా ఇప్పటి వరకూ విధులు నిర్వహించిన కొవ్వూరి నరేంద్రరెడ్డి కాకినాడ జిల్లా పెదపూడి ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కీర్తి స్పందన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు, అభివృద్ధి పథకాల వేగవంతానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కీర్తి స్పందనను మండలంలోని వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు.

అరేయ్ బాగున్నావా..


51 ఏళ్ల తర్వాత కలుసుకున్న కాజులూరు హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాజులూరు: ఎన్నాళ్లయిందీ నిన్ను చూసి.. ఏంటిరా ఇంత మారిపోయావు.. అసలు ఎక్కడుంటున్నావు.. ఏం చేస్తున్నావంటూ ఆప్యాయ పలకరింపులతో ఆనందాల సిరిజల్లు కురిసింది. 51 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఆ పూర్వ విద్యార్థులంతా సందడి చేశారు. 1973లో కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న విద్యార్థులు కాకినాడలో లైఫ్‌లైన్ ఆసుపత్రిలో కలుసుకున్నారు. శనివారం వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జీ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. డాక్టర్లు, ఇంజినీర్లు, టీచర్లు ఇలా వివిధ హోదాల్లో స్థిరపడిన చిన్ననాటి మిత్రులంతా కలసి ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అందరూ కలసి ఉమ్మడిగా చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగారు. ఆనాడు వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సర్వేశ్వరరావు, కామేశ్వరరావు, ఆంజనేయులు, వెంకటేశ్వరరావులను సత్కరించారు. విద్యార్థులంతా పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వెలుగుబంట్ల గంగరాజు, పెద్దిశెట్టి రాముడు, మహాలక్ష్మి, నున్న రామకృష్ణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు రెండు రోజుల శిక్షణ

కె.గంగవరం: ఈ నెల 7వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఉపసర్పంచ్‌లకు, ఇద్దరు వార్డు మెంబర్లకు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ ఉదయం 9 గంటల నుంచి స్థానికంగా ఉన్న ఐకేపీ మీటింగ్ హాల్ వద్ద శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. శిక్షణకు హాజరయ్యే ఉప సర్పంచ్‌లు, ఇద్దరు వార్డు మెంబర్లు తప్పని సరిగా ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌లో నమోదు చేయడానికి ఆధార్ కార్డు తీసుకురావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

రామచంద్రపురం రూరల్: విద్యార్థులు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ సూచించారు. ద్రాక్షారామ ఎస్వీ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్సై మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అంకిత భావంతో చదువుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాకోరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదల గ్రామంలో శనివారం రామచంద్రపురం నేత్ర ప్రాథమిక కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు సీహెచ్ కుమార్, పి. సాయిలక్ష్మిలు 90 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో 10 మందికి కంటి శస్త్ర చికిత్సలు, 30 మందికి కళ్లజోడు అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి కంటి చుక్కలు, మందులు అందజేశారు.

వ్యక్తికి గాయాలు

కాజులూరు: ఆర్యావటం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా.. కాకినాడ సూర్యనారాయణ పురానికి చెందిన సన్నబోయిన రామకృష్ణ తన బైక్‌పై ద్రాక్షారామ వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఆర్యావటం వాటర్‌ట్యాంక్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపై ఓ వ్యక్తి అడ్డుగా రావటంతో షడన్‌బ్రేక్ వేయగా బైక్ పల్టీ కొట్టడంతో రామకృష్ణ గాయాల పాలయ్యాడు. అతడిని స్థానికులు గమనించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అమ్మా.. భవానీ

- భవానీ దీక్ష స్వీకరిస్తున్న భక్తులు
- యువతలో పెరుగుతున్న భక్తిభావం
- క్లస్టర్ పరిధిలో పరిఢవిల్లుతున్న ఆధ్యాత్మికత


భవానీ మాలధారణ చేసిన భక్తుల కోలాహలం

రాయవరం: కాళ్లకు పసుపు..పారాణి, గజ్జెలు..చేతికి ఎర్రటి గాజులు..శరీరంపై ఎరుపు దుస్తులు ధరించిన భవానీ భక్తులు జై భవానీ..జైజై భవానీ అంటూ భవానీ మాలధారుల నినాదాలతో పల్లెలు ఎరుపెక్కుతున్నాయి. ఒక పక్క పంట పొలాలు పచ్చని పైరుతో కళకళలాడుతుంటే మరో పక్క భవానీ దీక్షదారుల ఎరుపు దుస్తులు పచ్చదనంతో పోటీ పడుతున్నట్టుగా ఉంది. భవానీ మాల ధరించిన భక్తులు వేకువజామునే లేచి పూజాదికాలు నిర్వహిస్తున్నారు. వాడవాడలా భవానీ భక్తులు పసుపు, కుంకుమలు..సకల సౌభాగ్యాలను ఇచ్చే పారాణి రాణికి ప్రణమిల్లుతున్నారు. పిల్లా పాపలు..పాడిపంటలు..పసుపు, కుంకుమలను చల్లగా చూడాలని కోరుతూ అమ్మవారికి తొమ్మిది రోజుల నిత్యపూజలతో మాలధారులు అమ్మవారిని కొలుస్తున్నారు.

వాడవాడలా ఆశ్రమాల ఏర్పాటు

మాలధారణ చేసిన భవానీ భక్తులు వాడవాడలా పీఠాలు ఏర్పాటు చేసుకుని అమ్మవారికి పూజలు చేస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లోని 120 గ్రామాల్లో భవానీ మాలధారులతో దసరా సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. విజయవాడలో వెలసిన దుర్గమ్మా.. నీ పూజకు పువ్వులు తెచ్చినమమ్మా అంటూ గీతాలాపన చేస్తూ అమ్మవారికి ప్రధానంగా కుంకుమ పూజలు చేస్తున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భవానీమాల ధరించిన భక్తులు వాడవాడలా భవానీ పీఠాలను ఏర్పాటు చేసుకుని, భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో అమ్మవారికి శక్తి కొద్దీ పూజలు చేస్తున్నారు.

నియమాలు పాటిస్తూ..

అమ్మవారి దీక్షలో ఉన్న భవానీ మాలధారులు పలు నియమాలు పాటిస్తున్నారు. రోజూ ఉదయం దుర్గాదేవిని దర్శించుకుంటున్నారు. దీక్షాపరులు కుంకుమ రంగు వస్త్రాలను ధరించి, మద్యం, మాంసం, ధూమపానం తదితర దురలవాట్లకు దూరంగా ఉంటూ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తున్నారు. పగటిపూట భోజనం, రాత్రి సమయంలో అల్పాహారం తీసుకుంటున్నారు. పాదరక్షలు లేకుండా, క్షరకర్మ చేయకుండా, మనసా, వాచా, కర్మణా బ్రహ్మచర్యం పాటిస్తూ..జైభవానీ, జై శక్తి అంటూ అమ్మవారి నామస్మరణ చేస్తున్నారు. కఠిన నియమాలు పాటిస్తూ అమ్మవారిని కొలిచే భక్తులతో పల్లెలు కళకళలాడుతున్నాయి.

పెరిగిన భవానీ భక్తులు


విజయవాడ పాదయాత్రగా వెళ్తున్న భవానీ భక్తులు (ఫైల్)


నిప్పులగుండం తొక్కుతున్న భవానీ మాలధారులు (ఫైల్)

ఈ ఏడాది భవానీ భక్తుల సంఖ్య బాగా పెరిగింది. భవానీ మాలధారణ చేసే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఈ ఏడాది అధిక సంఖ్యలో యువతతో పాటు, మహిళా భక్తులు కూడా మాలధారణ చేయడం విశేషం. భవానీ మాలధారణ చేసిన భక్తులు గ్రామాల్లో ప్రత్యేక పూజలు, భజనలు చేస్తూ దసరా ఉత్సవాలకు మరింత సందడి తీసుకొస్తున్నారు. అలాగే పలు చోట్ల భవానీ భక్తులు అగ్నిగుండాలు తొక్కుతూ తమ భక్తిప్రపత్తులను చాటేందుకు సిద్ధమవుతున్నారు.

కాలినడకన అమ్మ సన్నిధికి

భవానీ మాలధారణ చేసిన పలువురు భక్తులు కాలినడకన విజయవాడకు తరలి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. పాదరక్షలు లేకుండా కాలి నడకన సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న వారి సన్నిధికి ఇరుముడితో బయలు దేరి వెళ్లేందుకు భవానీ మాలధారులు సన్నద్ధమవుతున్నారు. విజయవాడలో అమ్మవారికి ఇరుముడి చూపించిన అనంతరం భక్తులు తిరిగి ఇంటికి వచ్చి పీఠం ఉద్వాసనతో మాలధారణ ముగియనుంది.

మూడో సారి దీక్ష తీసుకున్నా..



అమ్మవారిపై నమ్మకంతోనే మూడో సారి దీక్ష తీసుకున్నాను. అమ్మవారి దీక్షతో మంచి జరుగుతుందనే విశ్వాసం ఉంది. నవరాత్రులు తొమ్మిది రోజులు కఠినమైన దీక్షను చేపడతాను. దీక్షలో శక్తిదాయిని అయిన అమ్మవారిని నిత్యం స్మరిస్తుండడం, సేవలో పాల్గొనడం ఆనందాన్నిస్తుంది.

– పడాల ఛాయశ్రీ, భవానీ దీక్షాపరురాలు, రాయవరం

దైవానుగ్రహం



ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మికత అవసరం భగవంతుని పట్ల భక్తి భావం, ఆధ్యాత్మిక ప్రపత్తులు కలిగి ఉండడం ప్రతి ఒక్కరికీ అవసరం. పవిత్రతతో దీక్షలు అనుసరిస్తే అమ్మవారి కరుణా కటాక్షాలు లభిస్తాయి. దుర్గాదేవి దీక్షలో ఉంటే గొప్ప అనుభూతి కలుగుతుంది. మనసుకు ప్రశాంతత లభిస్తుంది.

వల్లూరి వీరవెంకటసత్యవరప్రసాద్ చౌదరి, భవానీ మాలధారుడు, రాయవరం

రోగులకు మెరుగైన సేవలందించాలి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర
- అంగర పీహెచ్‌సీ సందర్శన

కపిలేశ్వరపురం: ప్రభుత్వాదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖలోని ప్రతి ఒక్కరూ మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.దుర్గారావుదొర ఆదేశించారు. అంగర పీహెచ్‌సీలో వైద్యసేవలు అందిస్తున్న తీరును శనివారం ఆయన తనిఖీ చేశారు. మందుల నిల్వలు, రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి ఆసుపత్రి నిర్వహణ తీరును ఆయనకు వివరించారు. విష జ్వరాలు విజృంభిస్తున్న సమయంలో మరింత అప్రమత్తతతో వ్యవహరించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆదేశించారు. ఆయన వెంట ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీరత్నం, ఎంపీహెచ్ఎస్ పెమ్మరాజు సురేష్, సిబ్బంది ఉన్నారు.


అంగర పీహెచ్‌సీలో రోగిని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావుదొర

ఔదార్యంతో చేసిన సాయంతో దీర్ఘాయుష్షు

- అంగర పీహెచ్‌సీలో ప్రత్యేక బ్లాక్ ప్రారంభం
- రూ.75 లక్షల దాత సాయంతో నిర్మాణం
- దాత కుటుంబాన్ని కొనియాడిన నేతలు

కపిలేశ్వరపురం: ఔదార్యంతో చేసిన సాయం దాత కుటుంబ సభ్యులకు దీర్ఘాయుష్షును ఇస్తుందని మండలంలోని అంగర పీహెచ్‌సీలో ప్రత్యేక బ్లాక్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. అంగర గ్రామానికి చెందిన, అమెరికాలో వైద్య వృత్తిలో స్థిరపడిన బలుసు సుబ్బారావు రూ.75 లక్షలతో ఈ పీహెచ్‌సీ ఆవరణలో ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. తన తండ్రి బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ పేరున అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. వాటి కొనసాగింపుగా తన భార్య బలుసు వసుంధర జ్ఞాపకార్థం పీహెచ్‌సీలో బ్లాక్ నిర్మించారు. భవనాన్ని శనివారం మాజీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, కైకలూరు శాసన సభ్యుడు కామినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన నిర్వించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచులు తిరునాతి ఆదిలక్ష్మి, వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పెదిరెడ్డి శేషారత్నం, అద్దాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, డీఎంఅండ్ హెచ్‌ఓ ఎం.దుర్గారావుదొర, వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి దాత కుటుంబ సభ్యుల ఔదార్యాన్ని కొనియాడారు. వేదిక దాత సుబ్బారావు కుమారుడు డాక్టర్ ప్రతాప్, చంద్ర దంపతులు, కుమార్తె కుసుమలను సత్కరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ దాతల ఔదార్యానికి సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో స్పందించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో బలుసు జానకి రామయ్య, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, మాజీ ఎంపీపీ నెక్కంటి బాలకృష్ణ, పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, తిరునాతి వెంకటేశ్వరరావు, సంకాబత్తుల స్వామికాపు, త్రిపురశెట్టి నాని ఇరు గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.


ప్రత్యేక బ్లాక్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ఆక్రమణలపై కమిషనర్ కొరడా

మండపేట: మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన టీవీ రంగారావు పట్టణంలో పెరిగిపోయిన రోడ్డు ఆక్రమణలపై దృష్టి పెట్టారు. నెల రోజుల వ్యవధిలోనే ఆయన పట్టణంపై పట్టు సాధించారు. గతంలో ఇక్కడ ఆరు నెలల పాటు పని చేసిన అనుభవం కూడా ఆయనకు ఉపకరించింది.

స్థానిక పెద్ద కాలువ వంతెన వద్ద నుంచి రాజారత్న సెంటర్, బస్‌స్టాండ్, వాణీమహల్ సెంటర్, కలువపువ్వు సెంటర్ల నుంచి గుమ్మిలేరు రోడ్డు అయ్యప్ప ఆలయం, టోల్‌గేట్ వరకూ డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు. మున్సిపల్ సిబ్బందిని, సచివాలయ సిబ్బందిని బృందాలుగా విడగొట్టి వారికి కమిషనర్ తగు ఆదేశాలు ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో రంగారావు కూడా సమీక్షిస్తూ దుకాణాల నిర్వాహకుల హెచ్చరిస్తున్నారు. డ్రెయిన్లపై ఎలాంటి బోర్డులు, డేరాలు, షాపుల వారి సామగ్రి ఉండకూడదని హెచ్చరించారు. డ్రెయిన్లను మూసేసి సిమెంటు బల్లలు, ఇతర నిర్మాణాలు చేసి, వ్యాపార పబ్లిసిటీ కోసం ముందుకు వచ్చేస్తే పారిశుధ్య నిర్వహణ ఎలా సాధ్యపడుతుందని ఆయన ఆక్రమణదారులను ప్రశ్నిస్తున్నారు. కేవలం డ్రెయిన్ల పారుదల మెరుగుపరచాలనే ఉద్దేశంతోనే తామీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గ్రామాభివృద్ధికి నిరంతర కృషి

కాజులూరు: గ్రామాభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తున్నానని బందనపూడి గ్రామ సర్పంచ్ డేగల తిరుమలవేణి అన్నారు. శనివారం గ్రామ సచివాలయం వద్ద జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేయడంతో పాటు ప్రజా అవసరాలకు అనుగుణంగా చెప్పని హామీలను సైతం అమలు చేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వ నిధులతో పాటు దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్న తమ కుమారుడు డాక్టర్ డేగల నాగేంద్ర సహకారంతో సొంత నిధులు సైతం ఖర్చు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.


బందనపూడి గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ తిరుమలవేణి

పీడీఎస్‌యూ పోస్టర్ ఆవిష్కరణ

రామచంద్రపురం: విప్లవ ఉద్యమాల సంస్థ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) పోస్టర్‌ను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావుల చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ 1954లో ఏర్పడిన పీడీఎస్‌యూ 2024 అక్టోబర్ నాటికి 50 ఏళ్ల పూర్తయ్యాయన్నారు. 50 ఏళ్ల ప్రస్థానంలో ఆత్మ బలిదానం చేసిన అణు భౌతికశాస్త్రంలో గోల్డ్ మెడలిస్ట్ జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, వరహాలు వంటి నేతల స్ఫూర్తిగా ఉద్యమాలకు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో అంబటి కృష్ణ, చింతా రాజారెడ్డి, కరిపోతుల నవీన్‌కుమార్, టి.తరుణ్ నరేంద్ర, మధు, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవీ నమోస్తుతే..

- వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం
- వాడవాడలా శరన్నవరాత్ర ఉత్సవాలు

రాయవరం: మనం చేపట్టే ప్రతి మంచి కార్యక్రమానికి దేవుని ఆశీస్సులు తోడుగా ఉంటాయని తిరుపతి నుంచి వచ్చిన ఆధ్యాత్మిక వేత్తలు ధూళిపాళ కృష్ణమూర్తిశర్మ, గొర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి భక్తులకు ఉద్బోధించారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం వారు వెదురుపాక గ్రామంలోని విజయదుర్గా పీఠాన్ని సందర్శించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రతి ఒక్కరూ మంచి ఆలోచన, మంచి మనస్సు కలిగి ఉండాలన్నారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) లాంటి గురువును కలిగి ఉండడం భక్తుల అదృష్టంగా వారు పేర్కొన్నారు. పీఠాధిపతి గాడ్ భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పలువురు భక్తులు సామూహిక కుంకుమ పూజల అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు.

అన్నపూర్ణాదేవి రూపంలో

పీఠంలో విజయదుర్గా అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. పీఠ బ్రహ్మ శివ, చీమలకొండ వీరావధాని తదితరుల ఆధ్వర్యంలో వేద పండితులు విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ఏకవార రుద్రాభిషేకం, అమ్మవారికి అన్నపూర్ణా అష్టోత్తరంతో కుంకుమపూజలు, నవగ్రహ హోమం నిర్వహించారు. పీఠంలో భక్తులు కలశాలు ఏర్పాటు చేసుకుని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించుకున్నారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి) విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కర నారాయణ, సత్య వెంకటకామేశ్వరి, బలిజేపల్లి, సత్యకనకదుర్గ తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు.

రాయవరం మండలంలో..

మండలంలోని రాయవరం, వెదురుపాక, మాచవరం, సోమేశ్వరం, లొల్ల, పసలపూడి, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. రాయవరం రాజరాజేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవి రూపంలో అలంకరించారు. మహిళలు సామూహికంగా లలితా సహస్రనామా ర్చనలతో కుంకుమ పూజలు చేశారు. పలుచోట్ల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో మహిళలు మంటపాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు.


ప్రత్యేకాలంకరణలో సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి

రావులపేటలో అమ్మవారి సారె ఊరేగింపు

మండపేట: శరన్నవరాత్రుల సందర్భంగా జగన్మాత దుర్గాదేవి శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అన్నపూర్ణమ్మ అవతారమెత్తిన దుర్గమ్మను మహిళలు, చిన్నారులు, వృద్ధులు, పురుషులు, భవానీ మాలధారులు భక్తి శ్రద్ధలతో కొలిచారు. వేకువజాము నుంచే మండపేట పట్టణం, రూరల్ మండలంలోను నవరాత్రుల సందర్భంగా నెలకొల్పిన మంటపాల వద్ద సందడి నెలకొంది. దేవీ పాటలు, కోలాటాలు, అమ్మవారి విశిష్టతను వివరిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. రావులపేట జాంపేట వీధిలో అమ్మవారికి కమిటీ నిర్వాహకులు మోరం పాపారావు, దేవళ్ల శ్రీనివాస్ చౌదరి, రావూరి కోటేశ్వరరావు, యాళ్ల దుర్గాప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహించారు. రావులపేట, విద్యా వికాస్, అక్కల వారి వీధి, చింతావారి వీధి తదితర ప్రాంతాల నుంచి వందలాది మహిళలు ఈ సారె ఊరేగింపులో పాల్గొని అన్నపూర్ణమ్మ భక్తిని చాటారు. రకరకాల పిండి వంటలు, వివిధ రకాల పండ్లు, గాజులు, పసుపు, కుంకుమ, అరటిపండ్లను ఇత్తడి పళ్లెంలో ఉంచి మహిళలు వీధుల్లో తిరిగారు. అమ్మవారి ఊరేగింపు ముందు వీధులన్నింటినీ పసుపు నీటితో శుద్ధి చేసి అనంతరం ఊరేగించారు. పెద్ద ఎత్తున మహిళలు అన్నపూర్ణమ్మకు మొక్కి అన్నవస్త్రాలకు లోటు లేకుండా చూడాలని వేడుకున్నారు.


ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారికి సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు

భక్తిశ్రద్ధలతో అమ్మవారి పూజలు

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాల్లో మూడో రోజు శనివారం అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో అమ్మవారి మట్టి ప్రతిమకు గాయత్రీదేవిగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో మూడో రోజు గాయత్రీ దేవి అమ్మవారి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ఉపాధ్యక్షుడు పసుమర్తి సూర్యశేఖర్, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్, కోశాధికారి వెచ్చా కిషోర్, కార్యదర్శులు పసుమర్తి అరుణ్‌కుమార్, త్రిపురమల్లు గోపాల్ పూజల్లో పాల్గొన్నారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారు మూడో రోజు అన్నపూర్ణా దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహారాజ్ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేయగా, ఆలయ అర్చకుడు బొండు బాల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.


మండపేటలో సారెతో ఊరేగుతున్న మహిళలు

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

రామచంద్రపురం: పట్టణంలో ప్రసిద్ధి చెందిన కొత్తూరు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని మూడో రోజు అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.


గాయత్రీ దేవి అవతారంలో ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరిదేవి


అన్నపూర్ణాదేవిగా ఆదివారపుపేట పార్వతీదేవి


అన్నపూర్ణాదేవిగా కొత్తూరు కనకదుర్గమ్మ


అన్నపూర్ణాదేవి రూపంలో వెదురుపాక విజయదుర్గమ్మ


అన్నపూర్ణాదేవి అవతారంలో రాయవరంలో పార్వతీ సమేత రాజేశ్వరస్వామి